12 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-మోతుగూడెం

పట్టుబడిన గంజాయి, నిందితులు

అక్రమంగా తరలిస్తున్న 12 కేజీల గంజాయిని బుధవారం మోతుగూడెం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... చింతూరు మండలం, లక్కవరం జంక్షన్ వద్ద బుధవారం మోతుగూడెం పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో స్కూటీలో నలుగురు వ్యక్తులు వస్తుండగా దానిని ఆపి తనిఖీలు చేశారు. స్కూటీలో 12 కిలో కేజీల గంజాయిని గుర్తించారు. గంజాయి, స్కూటీని సీజ్ చేసి, నలుగురు నిందితులను అరెస్టు చేసి రంపచోడవరం కోర్టుకు తరలించారు. ఈ గంజాయి విలువ రూ.40వేలు ఉంటుంది. ఈ గంజాయిని సింధువాడ నుండి చెన్నైకి తరలిస్తున్నట్లు నిందితులు తెలిపారు. మోతుగూడెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..

- నిర్వాసితులకు ధైర్యం చెబుతూ సాగిన 'పోలవరం పోరుకేక'
- గ్రామగ్రామాన మహిళలు, చిన్నారులు ఎదురెళ్లి ఘనస్వాగతం

యాత్రలో పాల్గొన్న తులసీదాస్, చలసాని శ్రీనివాస్ తదితరులు

కళాకారుల ఆటాపాట

ప్రజాశక్తి - టి.నరసాపురం, జీలుగుమిల్లి

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోరుతూ సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' మహా పాదయాత్ర జిల్లాలో మూడోరోజు బుధవారం అత్యంత ఉత్తేజభరితంగా సాగింది. నిర్వాసితుల సమస్యలు వింటూ.. వాటిని పరిశీలిస్తూ నేతలు నిర్వాసితులకు ధైర్యం చెబుతూ సాగుతున్న యాత్రలో 'మేమున్నాం.. అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం.. పోరుబాట పడితే సమస్యలవే పరిష్కారమవుతాయి' అంటూ దిశా నిర్దేశం చేస్తూ నేతల ప్రసంగాలు పోరాట స్ఫూర్తిని నింపుతున్నాయి. పాదయాత్రకు మహిళలు, చిన్నారులు ఎదురెళ్లి అడుగడుగునా పూలదండలు వేసి, తిలకం దిద్ది హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు.

జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలోని మామిడిగొందిలో మూడోరోజు బుధవారం ప్రారంభమైన పాదయాత్ర బర్రింకలపాడు, వంకావారిగూడెం, మడకంవారిగూడెం, చీమలవారిగూడెం, పునరావాస కాలనీల మీదుగా కొరుటూరు కాలనీలు చేరుకుని రాత్రి బస చేసింది. పోరెడ్డిగూడెం, కట్కూరు పునరావాస గ్రామాల నిర్వాసితులు పాదయాత్ర బృందానికి తమ సమస్యలు చెప్పుకున్నారు. ఇప్పటికీ పరిహారం అందలేదని, కాలనీల్లో తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనిపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సిపిఎం చేపట్టే పోరాటాల్లో నిర్వాసితులంతా కలిసి రావాలని, సమస్య పరిష్కారమయ్యే వరకూ ఎర్రజెండా విశ్రమించదని చెప్పారు. సమస్యలను కెఆర్‌పురం ఐటిడిఎ పిఒకు ఫోన్ చేసి వివరించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. యాత్రలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విక్రమసింగ్ పాల్గొని సమస్యలు పరిశీలించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఎండగడుతూ నిర్వాసితులు చేపట్టాల్సిన పోరు గురించి దిశానిర్దేశం చేశారు. బర్రింకలపాడు రింగు రోడ్డు వద్ద ప్రజాశక్తి బృందం పాదయాత్రకు సంఘీభావం తెలిపింది. ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు బుధవారం మధ్యాహ్నం వరకూ పాదయాత్రలో పాల్గొన్నారు. వంకావారిగూడెంలో ఫౌండేషన్ పాఠశాలలో గిరిజన విద్యార్థులతో శ్రీనివాసరావు కొద్దిసేపు ముచ్చటించారు. ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, వ్యకాస, సిఐటియు రాష్ట్ర నేతలతోపాటు పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, ఎన్‌టిఆర్ జిల్లాల నేతలు ఈ యాత్రలో పాల్గొని నిర్వాసితుల సమస్యలపై నినదించారు. కళాకారుల కళారూపాల ప్రదర్శన, ఆలపించిన గీతాలు ఆకట్టుకోవడంతోపాటు ఆలోచింపజేశాయి. ఈ యాత్రలో భాగంగా ఆయా గ్రామాలు, కాలనీల్లో జరిగిన సభల్లో విక్రమ్‌సింగ్, శ్రీనివాసరావుతోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, బి.తులసీదాస్, కె.సుబ్బరావమ్మ, వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వై.అచ్యుతరావు, జయరాం, కె.హరికిషోర్, బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా నేతలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్ సింగ్

గిరిజన గ్రామాలు, పునరావాస కాలనీల మీదుగా సాగిన పాదయాత్ర

పోలవరంలో పోరుకేక ఉపయాత్రను ప్రారంభిస్తున్న వై.వెంకటేశ్వరరావు

ఉత్సాహంగా అడుగులేస్తూ..

పోలవరంలో ప్రారంభమైన 'పోరుకేక' ఉపయాత్ర

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన పోరుకేక ఉపయాత్ర బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు పాదయాత్ర ఉత్సాహంగా సాగింది. తొలుత జెండా ఊపి యాత్రను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఈ యాత్ర పోలవరం నిర్వాసితుల పునరావాస కాలనీల గుండా సాగింది. దేవరగొంది, తోటగొంది, రామన్నపాలెం, చేగొండిపల్లి, సింగన్నపల్లి, మామిడిగొంది కాలనీల గుండా సాగి దొండపూడి మీదుగా కొత్తూరు, కోండ్రుకోట, మాదాపురం, తెల్లవరం, గాజులగొంది గ్రామాల పునరావాస కాలనీకి చేరుకుంది. ఈ యాత్ర దళానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, తామా ముత్యాలమ్మ, గుడెల్లి వెంకట్రావు నాయకత్వం వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో నిర్వాసితులు తమ సమస్యలను యాత్ర బృందానికి చెప్పుకున్నారు. యాత్ర బృంద సభ్యులకు వారి గోడు విన్నవించుకున్నారు. పోలవరం మండలంలో 21 నిర్వాసిత గ్రామాలను ఖాళీ చేయించి పునరావాస కాలనీలకు బలవంతంగా తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాల్లో జీవనానికి ఎటువంటి ఇబ్బందీ ఉండేది కాదని చెప్పారు. రామన్నపాలెం కాలనీకి సంబంధించిన కొరస వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారికి కట్టాల్సిన పునరావాస ఇల్లు నిర్మించడం లేదని వాపోయారు. చేగొండపల్లి పునరావాస కాలనీలో మిడియం సారమ్మ మాట్లాడుతూ తన తల్లి మిడియం రామచల్లాయమ్మకు ప్రభుత్వం కట్టి ఇవ్వాల్సిన ఇల్లు ఇవ్వలేదని, దీంతో ఇరుకు ఇళ్లలో సర్దుకుని జీవిస్తున్నామని వాపోయారు. సింగన్నపల్లి పునరావాస కాలనీలో సున్నం ఆదిలక్ష్మి మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన తమకు ఇల్లు నిర్మించకుండా అధికారులు తిప్పించుకుంటున్నారని, ఉండడానికి ఇల్లు లేక అద్దె ఇంటిలో ఉంటున్నామని చెప్పారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో కె.శ్రీనివాస్, గుడెల్లి వెంకట్రావు, తామా ముత్యాలమ్మ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైనా నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టప్రకారం పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో నిర్వాసిత గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

బొడ్డు కృష్ణ, టిడిపి మండలాధ్యక్షులు, పోలవరం

నిర్వాసితుల కోసం సిపిఎం పోరాటం అభినందనీయం. నిర్వాసితులకు న్యాయం జరిగేలా వైసిపి ప్రభుత్వాన్ని మొద్దు నిద్ర నుంచి లేపడానికి పోరుకేక యాత్ర దోహదపడుతుంది. నిర్వాసితులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

గిరిజన హక్కులు పటిష్టంగా అమలు చేయాలి

-అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

-సిపిఎంలో 100మంది చేరిక

ప్రజాశక్తి-హుకుంపేట: గిరిజన హక్కులు పటిష్టంగా అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు, అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. తుంభవలస గ్రామానికి చెందిన 100మంది సీపీఎంలో చేరారు. జడ్పీటీసీ దీసారి గంగరాజు సమక్షంలో వీరంతా చేశారు. పార్టీలో చేరిన గిరిజనులు అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం భూర్జా పంచాయితీ, తుంభవలస గ్రామస్తులు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, ఆటవీ సంపదను కాపాడుకునేందుకు గిరిజనులు ఐక్య కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో అభివృద్ధి కానరాలేదన్నారు. తుంభ వలస గ్రామ ప్రజలు సీపీఎం సిద్దాంతలను నచ్చి సమస్యలు సాధించేందుకు చేరడం జరిగిందని తెలిపారు. సిపిఎం చేపడుతున్న ప్రజా ఉద్యమాలకు ఆకర్షితులై గ్రామస్థులంతా కలిసికట్టుగా పార్టీలో చేరారని ఆయన తెలిపారు. పార్టీ సిద్ధాంతలు వివరించి కండువాలు వేసి, సాధరంగా ఆహ్వానించారు. తుంభ వలస గ్రామంలో ప్రధాన సమస్యలైన రోడ్డు, మినీ అంగన్ వాడీ కేంద్రం, ఇల్లు, తాగునీరు, పైప్ లైన్ కుళాయి గ్రాంట్‌కు కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సీపీఎం జిల్లా నాయకులు సొంటేన హైమావతి, మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణ్‌రావు, నాయకులు తాపుల కృష్ణారావు, అప్పల కొండ పడాల్, పాంగి సోమన్న, కిల్లో రామారావు, మజ్జి బాలకృష్ణ, కొర్రా కృష్ణ, గ్రామస్తులు పృధ్వి, కొర్ర చిట్టిబాబు, కామేష్, శ్రీను, చిన్నం నాయుడు, అప్పల నాయుడు, కొండబాబు, రాజు, అప్పలమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గంగరాజు

30న దుంబ్రిగుడ మండల సమావేశం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఈనెల 30న స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారిని ఎం.ఉషారాణి తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ బాకా ఈశ్వరి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండల ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన రికార్డులతో సమయానికి హాజరు కావాలని ఆమె చెప్పారు. గైర్హాజరైన వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- ఎంపీడీవో యాదగిరేశ్వరరావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని చెరుకుంపాలెం, తంటికొండ గ్రామాల సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ఆకస్మిక సందర్శించి తనిఖీ నిర్వహించారు. సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్లను పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో యాదిగిరిశ్వరరావు మాట్లాడుతూ సచివాలయాలు ద్వారా ప్రజలకు పారిదర్శకంగా సేవలు అందించాలని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల అందేలా చూడాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు గ్రామస్థాయిలో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకుంపాలెం, తంటికొండ సర్పంచ్‌లు దాసరి నాగేశ్వరరావు, ఆగూరు సుబ్బలక్ష్మి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

90శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి -కొయ్యూరు

మండలంలోని చిట్టెంపాడు, గదబపాలెం పంచాయితీలకు చెందిన రైతులకు డౌనూరు రైతు భరోసా కేంద్రంలో బుధవారం 90శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఆర్‌జెఎల్, సాంబమసూరి, 1921, 1010, 1064, జీలకర సన్నాలు, స్వర్ణ తదితర రకాల విత్తనాలను 120 బస్తాలు అందజేశారు. ఈ సందర్భంగా చిట్టెంపాడు సర్పంచ్. నేమాని నూకలమ్మ, సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజేష్, మాజీ సర్పంచ్ నీలాపు సూరిబాబు, ఉల్లి రామ్మూర్తి, సచివాలయ కన్వీనర్ పెట్ల గాంధీ, నెగుల లక్ష్మణరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయం పరిధిలోనే విత్తనాలు పంపిణీ చేస్తున్నందుకు సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

చదువుతోనే సమాజం అభివృద్ధి

-జిల్లాలో తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి నగదు జమ -జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా ఫలాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువు కోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. చదువుకుంటేనే సమాజం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. బుధవారం ముఖ్య మంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా. కురుపాం నుండి జగనన్న అమ్మఒడి నిధుల విడుదలను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్, శాసన సభ్యులు భాగ్యలక్ష్మిలు అమ్మ ఒడి ప్రత్యక్ష ప్రసారాన్ని స్థానిక కాఫీ హౌస్ నుండి తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో లక్ష 1 వెయ్యి 170 మంది విద్యార్థులకు రూ.151 కోట్ల 75 లక్షల 50వేలను ప్రభుత్వం జమ చేసిందన్నారు. అమ్మ ఒడిని సద్వినియోగం చేసుకుని, చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఇంటర్మీడియట్ తరువాత విద్యార్థులు బయట ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాలని స్పష్టం చేసారు. ఏజెన్సీ నుండి బయటకు వెళితే పోటీ ప్రపంచంపై అవగాహన వస్తుందన్నారు. జిల్లాలో 5.50 లక్షల మహిళా పాపులేషన్ ఉందని, మహిళల చదువుతో సమాజం రూపు రేఖలు మారి పోతాయన్నారు. ఉపాధ్యాయులు బాధత్యగా నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యా ప్రమాణాలు మరింత మెరుగు పడాలన్నారు.

పాడేరు శాసన సభ్యురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకుని వచ్చిందన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచి నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. విద్యా రంగానికి రూ.52 వేల కోట్ల నిధులను బడ్జెట్లో కేటాయించారని పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, బూట్లు, టై విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు విద్యాదీవెన, వసతి దీవెన ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

అరకు శాసన సభ్యులు చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పేద విద్యార్థులను ఉన్నతంగా చదివించే బాధ్యతలు ముఖ్యమంత్రి జగనన్న చేపట్టారని తెలిపారు ప్రభుత్వం అందిస్తున్న విద్యా, వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందిస్తున్నారని చెప్పారు. పిల్లలను పాఠశాలలకు పంపించే బాధ్యత తలిదండ్రులపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ ఛైర్మన్ శతక బుల్లిబాబు, జిల్లా విద్యాశాఖాధికారి సలీం భాషా, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, పాడేరు ఎంపిపి ఎస్. రత్నకుమారి, కొయ్యూరు ఎంపిపి బడుగు రమేష్ బాబు, జెడ్పీటిసిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

సమస్యలపై అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి: అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్ వంటి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్ర వద్ద అంగన్వాడి కార్యకర్తలు నిరసన చేపట్టారు. అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్. కళావతి, పి.మంజుల ఆధ్వర్యంలో మండలంలోని పలు సెక్టర్లలో బుధవారం జరిగిన సమావేశం అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ఆందోళన చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జూలై 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు చిలకమ్మ, కుమారి పాల్గొన్నారు.

కరపత్రాలను అందజేస్తున్న అంగన్‌వాడీలు

వర్కర్ల బకాయిలు చెల్లించండి

సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-పాడేరు: ఆశ్రమ వసతి గృహ కార్మికులకు బకాయి పడ్డ మూడు నెలల వేతనం జులై 10లోపు చెల్లించాలని, లేనిపక్షంలో వంటలు నిలిపి వేసి ఐటిడిఏ ముందు ఆందోళన నిర్వహిస్తామని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరించారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరు జిల్లా ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ హాస్టల్ వర్కర్లకు గత మూడు నెలల నుంచి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఐటిడిఏ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా 'అదిగో బిల్లు పెట్టాం ఇదిగో బిల్లు' పెట్టామని మభ్యపెడుతూ మాయ మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే పోరాటానికి దిగాల్సి వస్తుందని, జులై 10 లోపు బకాయి పడ్డ మూడు నెలల వేతనాలు ఇవ్వకుంటే మరుసటి రోజు నుంచే వంటలు బంద్ చేసి ఐటిడిఏ ముందుకు ఆందోళన చేస్తామన్నారు.

ఆర్‌బికెకు మంత్రి పేరు పెట్టడం సిగ్గు చేటు

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు లో నిర్మించిన రైతు భరోసా కేంద్రానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పేరు పెట్టడం విడ్డూరంగా ఉందని టిడిపి నేత పైలా ప్రసాదరావు విమర్శించారు..ప్రజల పన్నులతో అమలు చేసే ప్రభుత్వ పథకాలకు, నిర్మాణాలకు వ్యక్తుల పేరు పెట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందని, దాన్ని అధికారులు అమలు చేయడం రివాజుగా వస్తుందన్నారు. కోడూరులో ఆర్‌బికేకు మంత్రి పేరు పెట్టడం, స్వయంగా ఆయనే ప్రారంభించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం రైతులకు చేసింది ఏమీ లేదని, విత్తనాలు, ఎరువుల పంపిణీ, పంటలు గిట్టుబాటు కల్పించడంలో ప్రబుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ సమస్యలు పట్టించుకోకుండా ప్రజల సొమ్ముతో నిర్మించిన భవనాలకు వారి పేరు పెట్టుకోవడం సరికాదన్నారు.

అంబులెన్స్‌లు ప్రారంభం

ప్రజాశక్తి-మాడుగుల:ప్రజల అవసరాల నిమిత్తం జనసేన నేత రాయపు రెడ్డి కృష్ణ ఆర్థిక సహాయంతో బుదవారం మాడుగులలో రెండు అంబులెన్స్‌లు ప్రారంభించారు. మాడుగుల, చీడికాడ మండలాలకు ఒకటి, దేవరాపల్లి, కే.కోటపాడు మండలాలకు మరొకటి చొప్పున రెండు అంబులెన్స్ లు ఏర్పాటు చేస్తున్నట్టు కృష్ణ తెలిపారు. అంతకు ముందు జన సైనికులతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించి, అనంతరం బస్ స్టాండ్ ఆవరణలో వీటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో నాలుగు మండలాలకు చెందిన జనసేన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. సాంబ మసూరి, సొన మాసూరి, స్వర్ణ మసురి, ఇంద్ర, శ్రీకాకుళం సన్నాలు వంటి వంగడాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, ఎంపిటిసి విజయలక్ష్మి, వార్డు సభ్యులు మహేశ్వరి, ఆర్‌బికే అధ్యక్షులు శ్రీదర్, వ్యవసాయ అధికారి వాసుదేవరావు, సిబ్బంది సత్యనారాయణ, జ్యోతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో గ్రామాలాభివృద్ధి

ప్రజాశక్తి-కోటవురట్ల:వైసిపి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. బుధవారం ఆయన కైలాసపట్నం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణం చేపట్టిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న ప్రభుత్వంలోని గ్రామీణ ప్రాంతాలు అన్ని విధాలుగా అభివృద్ధి బాట పయనిస్తున్నాయన్నారు. అనంతరం గ్రామంలో గడపగడపకు తిరిగి స్థానికుల సమస్యలు అడిగి తెలుసు కోవడంతో పాటు సంక్షేమ పథకాల పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు, జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, స్థానిక సర్పంచ్ నూకరత్నం, ఎంపీటీసీ సభ్యులు వెంకటరమణ, ఉప సర్పంచ్ నాగేశ్వరరావు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.

హైకోర్టు స్టేతో రోడ్డు విస్తరణ నిలుపుదల

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం ప్రధాన రహదారి విస్తరణ పనులు తాత్కాలికంగా నిలుపుదల చేయాలంటూ రాష్ట్ర హైకోర్టు తాత్కాలికంగా స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు పలువురు రిట్ పిటీషన్లు దాఖలు చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత డిసెంబర్ 30న రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేసి రూ.10.5 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో స్థానిక అబీద్ కూడలి నుంచి పెద్ద మదుం వరకు వంద అడుగుల మేర రహదారి విస్తరణకు వీలుగా మున్సిపల్ అధికారులు మార్కింగ్ తదితర అన్ని ప్రక్రియలు పూర్తి చేసి భవనాల యజమానులకు కట్టడాల తొలగింపునకు వీలుగా చివరి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసుల ఆధారంగా విస్తరణ ప్రక్రియతో తామంతా తీవ్రంగా నష్టపోతామని పేర్కొంటూ భవన యజ మానులు 18 మంది హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వీరికి మాత్రమే స్టే మంజూరు చేస్తూ తొలగింపు పనులు నిలిపి వేయాల్సిందిగా మున్సిపల్ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. తరువాత ఆదేశాలు ప్రకటించే వరకు వీటిని చేపట్టరాదని పేర్కొంది. కోర్టుకు వెళ్లిన మరో 14 మందికి సైతం ఈ విధంగానే ఉత్తర్వులు వచ్చాయి. ఈ విషయమై మున్సిపల్ అధికారులెవరూ స్పందించ లేదు.

ఇలా ఉండగా ఈ రోడ్డు విస్తరణను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఎమ్మెల్యే, కొందరు కౌన్సిలర్లు మంగళవారం ఈ ప్రాంతంలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సైతం వాయిదా వేసుకొని విజయవాడకు పయనమయ్యారు. వీటిపై మంగళగిరిలో అడ్వకేట్ జనరల్, కొందరు న్యాయవాదులతో మంతనాలు చేసినట్లు సమాచారం. హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో వ్యాపారులు, భవన యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్ బ్యాగులు అరకొరే...!

జిల్లాకు చేరనవి 45 వేలు
పంపిణీదారుని అలసత్వం
జగనన్న కిట్లు పూర్తిగా అందని వైనం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పాఠశాలలు తెరిచి రెండు వారాలు దాటింది. పాఠ్యపుస్తకాలు సహా విద్యాకానుక ద్వారా ప్రభుత్వం అందజేస్తామన్న మెటీరియల్ ఇప్పటికీ పూర్తి స్థాయిలో విద్యార్థులకు చేరలేదు. తరగతులు ప్రారంభమైనా పుస్తకాలు విద్యార్థులకు అరకొరగా ఇచ్చారు. బ్యాగ్‌లు మినహా మిగిలిన విద్యాకనుక కిట్లు విద్యార్థులకు పంపిణీచేసినట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నా... వాస్తవానికి ఒక్కో పాఠశాలలో ఒక్కో కిట్ సమస్య ఉంది. అన్నిటికంటే బ్యాగులు సమస్య ఎక్కువగా ఉంది. స్కూల్ బ్యాగులు తగినన్ని పంపిణీదారు జిల్లాకు ఇవ్వకపోవడంతో చిరిగిన పాత బ్యాగులతో స్కూళ్లకు వెళ్తున్నారు. జిల్లాలో లక్షా 23 వేల బ్యాగులు అవసరం కానున్నాయి. 24 మండలాల్లో సగం మండలాలకు బ్యాగులు చేరలేదు. ఇంతవరకు 78 వేల బ్యాగులు జిల్లాకు చేరాయి. ఇంకా 45 వేలు రావాల్సివుంది. అచ్యుతాపురం, బుచ్చయ్యపేట, చోడవరం, గొలుగొండ, కశింకోట, కోటవురట్ల, మాకవరపాలెం, నర్సీపట్నం, నాతవరం, పరవాడ, రావికమతం, రోలుగుంట, వి.మాడుగుల మాండలాలకు బ్యాగులు ఒక్కటీ

చేరలేదు.

ఒకటి, రెండు రోజుల్లో బ్యాగులొస్తాయని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. బెల్టులు, షూలు అందరికీ వచ్చాయని చెబుతున్నా విద్యార్థులకు అందని పరిస్థితి ఉంది. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది మండల ప్రాథమిక ఇంగ్లీష్ మీడియం పాఠశాలలలో బెల్ట్‌లు అందలేదని బాలికలు ప్రజాశక్తికి తెలిపారు. పరవాడ మండలం పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మగ పిల్లలకు బుధవారం షూలు ఇచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. బాలికలకు షూ కొలతలు తీసినట్లు చెప్పారు.

ప్రతి పాఠశాలలోనూ జగనన్న విద్యాకనుక కిట్లు సరిపడా సకాలంలో రాక విద్యార్థులకు అందని పరిస్థితి ఉంది.

విశాఖలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

విశాఖ విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మంత్రులు బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, ఎంపీ విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-విశాఖపట్నం : రాష్ట్ర ముఖ్యమంత్రి జగనోన్మహన్‌రెడ్డి పార్వతీపురంమన్యం జిల్లా కురుపాంలో నిర్వహించే అమ్మఒడి కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం ఉదయం ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి విశాఖ విమానాశ్రయానికి ఉదయం 9.10 గంటలకు చేరుకున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు విజయసాయిరెడ్డి, ఎంవివి.సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్‌రాజు, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ తదితరులు ముఖ్యమంత్రికి పుష్ప గుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రత్యేక హెలికాప్టర్లో 9.20 గంటలకు పార్వతీపురం-మన్యం జిల్లాకు బయలుదేరి వెళ్లారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి : రైతు సంఘం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని రేబాక పంచాయతీ శివారు తిరుపతిపాలెం గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, తిరుపతిపాలెం గిరిజనలు గత 50 సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం 2005లో తీసుకు వచ్చిన అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు 10 ఎకరాల వరకు పట్టాలు ఇవ్వ వచ్చునని, దానికి అనుగుణంగా తిరుపతిపాలెం గ్రామంలో 2021 సంవత్సరంలో సర్వే చేసి లబ్దిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. నేటి వరకు సాగులో ఉన్న గిరిజనులకు పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. దీంతో ప్రభుత్వం నుండి వస్తున్న రైతు భరోసా, పిఎం కిసాన్ వంటి పథకాలను గిరిజనలు పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ.డేవిడ్ రాజు, శ్రీను, అప్పారావు, వెంకటరమణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో గెడ్డపాలెం గ్రామానికి చెందిన మహిళ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఆయన ఇచ్చిన సమాచారం మేరకు.. గెడ్డపాలెం గ్రామానికి చెందిన మాదేపల్లి అమలావతి (39) తన భర్త మాణిక్యం ఈ నెల 26వ తేదీ రాత్రి కూర బాగా వండలేదని కోపడ్డాడు. భర్త కోపడ్డాడన్న దిగులుతో అదే రోజు రాత్రి సుమారు 11 గంటల సమయంలో గడ్డి మందు తాగింది. భర్తను భయ పెట్టేందుకు గడ్డి మందు తగినట్లు తన కుమార్తె తలపు సంధ్య తెలిపిందన్నారు. మరుసటి రోజు ఉదయం 9గంటల సమయంలో నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం కేజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. అమలావతి కుమార్తె ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ ప్రసాదరావు తెలిపారు.

30న ధర్నాను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: ఈనెల 30న విద్యుత్ డివిజనల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు కోరారు. కృష్ణాబజారు, ఎన్‌టీఆర్ స్టేడియం తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల అమలు నిర్ణయాన్ని విరమించు కోవాలని డిమాండ్ చేసారు. వాడిన విద్యుత్ కంటే సర్దుబాటు, ఇతర సుంకాల పేరుతో అదనపు బారం మోపుతున్నారని, సామాన్యడుకి వేల రూపాయిలు విద్యుత్ బిల్లు వస్తుందని తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్లకు ప్రభుత్వం అధికంగా ఖర్చు చేస్తుందని, ఆదాని వంటి కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దోచి పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో పాత మల్లంపేట పంచాయతీలో సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి ఆనంద్ ఆధ్వర్యంలో కార్యదర్శి రమణ ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగునీటి నిల్వలు చేరకుండా పూడికతీతను చేపట్టామన్నారు. పంచాయతీలో పాత మల్లంపేట, ద్వారకానగర్, కొత్తపాలెం గ్రామాల్లో కాలువల పూడిక తీత పనులను చేస్తున్నామన్నారు. పంచాయతీలో పారిశుధ్యం పై దృష్టి సారించి పనులు చేస్తామని ఆమె తెలిపారు.

ఉపమాకలో తొలి ఏకాదశికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ఈనెల 29న గురువారం నాడు తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గరుడాద్రి పర్వతంపై ఉన్న కల్కి వెంకటేశ్వర స్వామి మూలవిరాట్‌కు తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తామన్నారు. భక్తులందరికీ దర్శన సౌకర్యం నిమిత్తం కొండ దిగువన ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ఉపాలయాలలో నిత్యార్చనలు చేసి భక్తులందరికీ రాత్రి 7 గంటల వరకు దర్శన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం స్థానిక శ్రీనివాస భక్త సమాజం వారిచే హరినామ సంకీర్తనలతో గిరి ప్రదక్షిణ ఉత్సవం జరుగుతుందని, ఇందుకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రసాద్ ఆచార్యులు తెలిపారు.

జగనన్న సురక్షకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కోటవురట్ల:ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష పథకం దరఖాస్తులు పట్ల నిర్లక్ష్యం చేయరాదని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ అన్నారు. బుధవారం రాజుపేటలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలో చేపడుతున్న కోటవురట్ల రెండు సచివాలయాలు, చౌడవాడ, రాజుపేట సచివాలయాల పరిధిలో 282 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. వీటిలో 194 దరఖాస్తులు సంబంధిత అధికారులు పరిశీలనకు పంపించినట్లు పేర్కొన్నారు. కోటవురట్లలో 188, కోటవురట్ల 2లో 85, చౌడువాడ 126, రాజుపేట 95, వివిధ ధ్రువ పత్రాలకు దరఖాస్తు చేసుకున్నట్లు ఆమె తెలిపారు. వీరికి సమగ్ర విచారణ అనంతరం వచ్చే నెల ఒకటి, మూడు తేదీల్లో జగనన్న సురక్ష ధ్రువ పత్రాలు అందజేస్తామన్నారు

పోలవరం పోరుకేక నిర్వాసితులకు
సంఘీభావ నిధి సేకరణ

విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -కొయ్యూరు : పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం చేపట్టిన పోరుకేక మహాపాదయాత్రకు సంఘీభావంగా ఆ పార్టీ నాయకులు బుధవారం మండల కేంద్రంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు ఎస్.సూరిబాబు, వై.అప్పలనాయుడు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సర్వస్వం త్యాగం చేసిన ప్రజలకు నష్టపరిహారం, పునరావాసం కల్పించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని తెలిపారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం నిర్వాసితుల పునరావాసం, ప్యాకేజీ కోసం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జంపా పెంటయ్య, పాంగి గంగరాజు, నాయకులు యామల నమ్రత నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏడు గ్రామాల్లో భూసమీకరణ

జగనన్న ఇళ్ల స్థలాలకు ల్యాండ్‌పూలింగ్

ప్రజాశక్తి - భీమునిపట్నం : జగనన్న ఇళ్ల స్థలాల కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా ఏడు గ్రామాల్లో భూసమీకరణ చేపడుతున్నట్లు తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 6న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈమేరకు దాకమర్రిలో 12 ఎకరాలు, నిడిగట్టులో 6.33 ఎకరాలు, ఆర్‌వై అగ్రహారంలో 47.07 ఎకరాలు, నేరెళ్లవలసలో 31.55 ఎకరాలు, తాళ్ళవలసలో 16.6 ఎకరాలు, చిప్పాడలో 16.61 ఎకరాలు భూ సమీకరణ చేయనున్నారు

ల్యాండ్ పూలింగ్-2లో భాగంగా రైతుల ఆమోదంతోనే భూసమీకరణ చేపడతామని, ఈ మేరకు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఫారం-3 ద్వారా రైతులు అంగీకారం మేరకు ల్యాండ్ పూలింగ్ ద్వారా భూసేకరణ చేస్తామన్నారు. నిర్వాసితులకు ఎకరాకు 900 చదరపు గజాలు చొప్పున విఎంఆర్‌డిఎ అభివృద్ధి చేయనున్న లే అవుట్‌ల్లో స్థలాన్ని నిబంధనల మేరకు కేటాయిస్తారన్నారు సంబంధిత అసైన్డ్ భూముల్లో ల్యాండ్ పూలింగ్ చేపట్టి, లే అవుట్‌లు వేసేందుకు విఎంఆర్‌డిఎకు అప్పగిస్తామన్నారు.

గంగవరం పోర్టులో పర్యటించిన సిపి

ప్రజాశక్తి- గాజువాక: నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ బుధవారం గంగవరంలో పర్యటించారు. కొద్దిరోజులుగా వేతన సమస్యలపై ఆందోళన చేస్తున్న పోర్టు కార్మికులు, దిబ్బపాలేనికి ఆనుకుని ఉన్న గంగవరం పోర్టు గోడను తొలగించి, జట్టీలోకి ప్రవేశిస్తారని సమాచారం రావడంతో, అక్కడి పరిస్థితులను పరిశీలించేందుక ముందస్తుగా ఆ ప్రాంతంలో పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ పర్యటించారు.అక్కడి పోలీసు భద్రత, రక్షణ చర్యలపై పరిశీలించారు. తర్వాత ఆదాని గంగవరం పోర్టు ముఖద్వారం వద్దకు వచ్చి, బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించారు. తర్వాత గంగవరం పోర్ట్ లోపలికి వెళ్లి గంట పాటు రహస్య సమావేశం నిర్వహించి, నగరానికి తిరుగుపయనమయ్యారు సిపితోపాటు . డిసిపి నాగన్న, ఎసిపిలు, గాజువాక, న్యూపోర్ట్ సీఐలు, ఎస్ఐలు పోలీసులు ఉన్నారు..

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

పోలవరం నిర్వాసితులు తరలిరావాలని సిపిఎం పిలుపు

విఆర్.పురం, ఎటపాకల్లో మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-విఆర్.పురం :పోలవరం నిర్వాసితుల పోరుకేక పాదయాత్ర ముగింపు సందర్భంగా జులై 4న విజయవాడలో జరుగుతున్న మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను స్థానిక రేఖపల్లిలోని సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ మహాధర్నాకు మండల వ్యాప్తంగా నిర్వాసితులు ఇంటికో మనిషి ఊరుకో బండితో విజయవాడ తరలిరావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం, పునరావాసాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మోడీ ప్రభుత్వానికి భజన చేయడం తప్పా నిధులు రప్పించడంలో తీవ్ర విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు ఎ.రాము, పంకు సత్తిబాబు, సోడి మల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎటపాక : విజయవాడలో జులై 4న జరిగే మహాధర్నా వాల్ పోస్టర్‌ను సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తోటపల్లిలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం మహా పాదయాత్ర చేపట్టిందని తెలిపారు. పార్టీలకు అతీతంగా నిర్వాసితులు పాదయాత్రకు బ్రహ్మరథం పట్టారన్నారు. నిర్వాసితులంతా ఐక్యమై ఉద్యమిస్తే ప్రభుత్వాలు దిగిరాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఐవి, నాయకులు ఐ.పద్మ, ఆకిశెట్టిరాము, సోందె రామారావు, ఇరపా సత్యం, మాటూరి బాలకృష్ణ, పర్శిక ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష జయప్రదం చేయండి

కొయ్యూరులో ప్రారంభమైన ఇంటింటి సర్వే... రాయపల్లిలో సన్నద్ధతపై సమావేశం

కొయ్యూరులో వివరాలను సేకరిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-కొయ్యూరు :మండలంలోని ఆడాకుల పంచాయతీ పరిధిలో బుధవారం జగనన్న సురక్షపై సర్వే నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కొయ్యూరు వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, ముటేషన్, టైటిల్ డీడ్ పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ లింక్, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు, హౌస్ హోల్డ్ స్ప్లిట్ చేయుట తదితర 11 రకాలైన సేవలను ప్రతి ఇంటికీ వెళ్లి ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు పిఎసిఎస్ మాజీ చైర్మన్ అప్పన గజ్జయ్యదొర, సచివాలయం కన్వీనర్లు గాడి ఆచ్చిరాజు, ధోని బాబ్జీ, గృహ సారథులు, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాయపల్లి సచివాలయంలో సమావేశం

అడ్డతీగల : మండలం రాయపల్లి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్, డిఎల్‌పిఒ జిఎల్‌ఎన్‌వి. రాఘవన్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని, ఏ రోజు వచ్చిన దరఖాస్తులు అదే రోజు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చదల విశ్వనాథ్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఇఇ డి.చిన్నబ్బులు, పంచాయతీ కార్యదర్శి పీవీ రెడ్డి, విఆర్‌ఓ జగన్నాథం పాల్గొన్నారు.



రాయపల్లిలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాఘవన్

బీమా పరిహారం చెక్కు అందజేత

మృతుని భార్యకు చెక్కు అందజేస్తున్న పిఎసిఎస్ అధ్యక్షుడు

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని చింతవానిపాలెం గ్రామానికి చెందిన రైతు శెట్టి బాలరాజు ఇటీవల మృతి చెందగా, కొయ్యూరు పిఎసిఎస్ నుండి మంజూరైన రూ.30 వేలు బీమా చెక్కును ఆయన భార్య సుభద్రకు బుధవారం పిఎసిఎస్ అధ్యక్షులు సుమర్ల సూరిబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో సభ్యత్వం కలిగిన రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ బ్యాంకు పనిచేస్తుందని చెప్పారు. సొసైటీ ఖాతాదారులైన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

'లూలూ ముసుగులో ప్రభుత్వ ఆస్తుల కబ్జా'

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖకు లూలూ సంస్థ రాకపోయినా, దాని ముసుగులో రూ.వెయ్యి కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను వైసిపి పెద్దలు, ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. బుధవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని ఆసరాగా తీసుకొని, వైసిపి పెద్దలు అత్యంత విలువైన ఆరు ప్రభుత్వ స్థలాలను తమ ఖాతాలో వేసేసుకున్నారన్నారు. పరిపాలనా రాజధాని చేయాలనుకుంటున్న వైసిపి, విశాఖలోని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిందిపోయి ప్రైవేటు వ్యక్తుల నుంచి వాటిని లాక్కొని,ఎల్‌ఎల్‌పి కంపెనీలను సృష్టించి వాటిని అప్పజెపుతోందన్నారు.

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో జరిగిన లూలూ ఒప్పందాన్ని రద్దు చేసుకుని, దీంతో అప్పట్లో జరిగిన భూబదిలీ వ్యవహారంలో విశ్వప్రియా ఫంక్షన్ హాల్‌కు అప్పగించిన నగరంలోని ఆరు స్థలాలు తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజాప్రయోజనాల కోసం కేటాయిస్తారని ప్రజలంతా ఆశిస్తే, వాటిని ఎల్‌ఎల్‌పి కంపెనీలను సృష్టించి వాణిజ్య సముదాయాలను నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, లూలూ ఒప్పందం రద్దుతో స్వాధీనం చేసుకున్న నగరంలోని ఆరుస్థలాలను ప్రజాప్రయోజనానికే వినియోగించాలని మూర్తి యాదవ్ కోరారు. దీనిలో జరిగి అక్రమ వ్యవహారాలపై కేంద్రం సిబిఐతో దర్యాప్తు జరిపించి, బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షల్లో సిద్ధమవుతున్న విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. సమకాలీన అంశాలు, జాతీయ ఉద్యమం, శాస్త్రసాంకేతిక విజ్ఞానం, భారత రాజ్యాంగం, ఆర్థిక భూగోళ శాస్త్రాలు మొదలైన విషయాలపై నిర్వహించిన క్విజ్ పోటీలో ఏడు బృందాలుగా 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయం సంయుక్త కార్యదర్శి డాక్టర్ డివి సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించి పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు పోటీ పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారికి ఇటువంటి కార్యక్రమాలు ప్రయోజనకరంగా ఉంటాయని విద్యార్థులు సూచించారు.

అదృశ్యమైన చైతన్య విద్యార్థుల సేఫ్!

ప్రజాశక్తి -గాజువాక :గాజువాక చైతన్య కళాశాల విద్యార్థుల అదృశ్యంపై ఐదురోజుల ఉత్కంఠకు తెరపడింది. ఈనెల 25న గాజువాక నుంచి కె.కోటపాడు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు తర్వాత కనిపించకుండా పోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గాజువాక పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని, విభిన్న కోణాల్లో దర్యాప్తును చేపట్టడంతో సికింద్రాబాద్‌లో సేఫ్‌గా ఉన్నట్లు గుర్తించారు. వారిని గాజువాక తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ మేరకసొక టీమ్‌ను సికింద్రాబాద్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు.